## • పంట నష్టపరిహారం ఎక్కడ?



భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. వీరికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ..ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల కుటుంబాలు రోడ్డున పడుతాయని వాపోయారు. అనంతరం తహసీల్దార్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా ముగిసిన తరువాత కొందరు రైతులు పెద్దకొడప్‌గల్ రైతువేదక వద్దకు వెళ్లగా తాళం వేసి ఉంది. ఉదయం 11.30 గంటలైనా ఒక్క అధికారి రాకపోవడంతో అన్నదాతలు అసహనం వ్యక్తంచేశారు. ఏవో కిషన్‌తో మాట్లాడి.. వచ్చేవరకు రైతువేదిక వద్ద పడిగాపులు కాశారు.

- పెద్ద కొడప్‌గల్

# రుణమాఫీ కాలేదని రైతు ఆత్మహత్యాయత్నం

- జగిత్యాల దవాఖానలో చావు బతుకుల్లో రైతు సాగర్‌రెడ్డి
- గతంలో రైతుధర్నాలోనే ఆత్మహత్యాయత్నం
- ఇరవై రోజులైనా పరిష్కారం చూపని అధికారులు

జగిత్యాల, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాలేదని ఇరువై రోజుల క్రితం రైతు ధర్నాలో ఆత్మహత్యాయత్నం చేసిన జగిత్యాల జిల్లాకు చెందిన ఓ రైతు తీవ్ర ఆవేదనతో మరోసారి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం దవాఖానలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటకు చెందిన ఏనుగు సాగర్‌రెడ్డి(40)కి మూడెకరాలు ఉంది. భార్య మంజుల పేరున రెండెకరాలు ఉంది. సాగర్‌రెడ్డి భూషణ్‌రావుపేటలో ఉన్న సింగిల్ విండోలో ₹50వేలు, దక్కన్ గ్రామీణ బ్యాంకులో ₹లక్ష



జగిత్యాల దవాఖానలో చికిత్స పొందుతున్న రైతు ఏనుగు సాగర్‌రెడ్డి

రుణం తీసుకున్నాడు. మంజుల దక్కన్ గ్రామీణ బ్యాంకులో ₹1.60 లక్షల పంట రుణం తీసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పడంతో తన పేరిట ఉన్న ₹1.50 లక్షల రుణం, తన భార్య పేరిట ఉన్న ₹1.60 లక్షల రుణంలో కనీసం ఒకటి మాఫీ అవుతుందని భావించాడు. అనూహ్యంగా ఇద్దరికీ రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం రాత్రి భూషణ్‌రావుపేటలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కథలాపూర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో జగిత్యాల ప్రధాన దవాఖానకు తీసుకెళ్లారు.

### అధికారులు స్పందించి ఉంటే...

రుణమాఫీ కోసం ఆగస్టు 20న కథలాపూర్‌లో రైతులు భారీ ధర్నాను చేపట్టారు. ధర్నాలో పాల్గొన్నప్పుడే సాగర్‌రెడ్డి పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడు. పోలీసులు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అన్ని మీడియాల్లోనూ సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం ప్రచురితమైంది. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డినే తన భర్త ఆత్మహత్యాయత్నానికి కారణమని భార్య మంజుల ఆరోపించింది. బుధవారం రాత్రి రైతు సాగర్‌రెడ్డిని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు.

## • ఫార్మాసిటీ వద్దే వద్దు



రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామ రైతులు తమ భూముల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయొద్దని బుధవారం ఆందోళనకు దిగారు. ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థూపం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. మేడిపల్లిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తే మరో ఉద్యమానికి రైతులు సిద్ధం కానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గణేశ్, పాపిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- యాచారం

## చిన్నారిని కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 11: ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరిన ఏడాది వయస్సు గల చిన్నారిని సకాలంలో దవాఖానకు తరలించి మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ బ్లూకోల్ట్స్ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. శ్రీరాంపూర్‌కు చెందిన బాబుకు బుధవారం తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు మంచిర్యాల దవాఖానకు తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా, సీసీసీ కార్నర్ వద్దకు చేరుకోగానే బాబుకు ఫిట్స్ వచ్చింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు బాబుకు ప్రథమ చికిత్స చేసి తమ బైక్‌పై సమీపంలోని



చిన్నారిని దవాఖానకు తీసుకెళ్తున్న పోలీసులు

దవాఖానకు తరలించారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

## • తలుపులకు వినతి!



కరెంటు సమస్యను పరిష్కరించాలంటూ విద్యుత్‌శాఖ కార్యాలయ తలుపులకు వినతిపత్రాన్ని అంటించిన ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. కచ్‌వార్ గ్రామంలో తరచూ కరెంట్ సమస్య వేధిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తంచేసిన స్థానికులు, రైతులు.. మక్తల్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేషన్ కార్యాలయానికి తరలివెళ్లగా ఏఈతో సహా సిబ్బంది లేకపోవడంతో తలుపునకు వినతిపత్రాన్ని అంటించి వెనుదిరిగారు.

-మక్తల్



సిద్దిపేట జిల్లా మద్దూరు జూనియర్ కళాశాలలో మరుగుదొడ్డి వద్ద క్యూలైన్ కట్టిన విద్యార్థులు

# ఒక్క మరుగుదొడ్డి.. 150 మంది క్యూ!

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉన్నది. దీంతో విద్యార్థినులు చెప్పుకోలేని బాధను అనుభవిస్తున్నారు. కళాశాలలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 90 మంది బాలికలు, 60 మంది బాలురు ఉన్నారు. వీరికి తోడు 15 మంది అధ్యాపకులు ఉన్నారు. వీరందరికీ కలిపి కళాశాల ఆవరణలో ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉంది. దీంతో విరామ సమయంలో బాలికలు మరుగుదొడ్డి వద్ద క్యూలైన్ కట్టడం నిత్యకృత్యమైంది. బాలురు, అధ్యాపకులు మాత్రం ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న ఒక్క మరుగుదొడ్డి సైతం శిథిలావస్థకు చేరింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి పోయాయి. మరిన్ని మరుగుదొడ్లను నిర్మించి తమ ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

## గురుకులంలో మరో విద్యార్థికి పాముకాటు

- కరీంనగర్ దవాఖానలో చికిత్స.. తప్పిన ప్రమాదం
- సుల్తానాబాద్ శాస్త్రీనగర్ కళాశాలలో ఘటన
- పాడుబడిన రైస్‌మిల్ పక్కనే కళాశాల ఏర్పాటు
- అపరిశుభ్ర పరిసరాలే కారణమని తల్లిదండ్రుల ఫైర్



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి మన్విత్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 11: అధ్వానంగా మారిన గురుకులాల్లో పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతున్నది. ఇటీవల మెట్‌పల్లి మండలంలోని గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం కలకలం రేపింది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో బుధవారం ఓ విద్యార్థి పాముకాటుకు గురికావడం ఆందోళన కలిగించింది. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రీనగర్ గురుకుల కళాశాలలో జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన బత్తిని మన్విత్ ఆరో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే బుధవారం మధ్యాహ్న భోజనం చేశాడు. కాసేపటికి మలవిసర్జన కోసం ఆవరణలోని బాత్‌రూమ్‌కు వెళ్తుండగా పాముకాటు వేసింది. దీంతో మన్విత్ కేకలు వేయడంతో సిబ్బంది వెంటనే గమనించి సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుడి సూచనల మేరకు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేకపోయినప్పటికీ 24 గంటలు పర్యవేక్షణలో ఉండాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బంది కలిసి దవాఖానకు చేరుకుని విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, పక్కనే పాడుబడ్డ రైస్ మిల్లు ఉండటంతో పాములు సంచరిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు.

# కుక్క కాట్లపై సర్కారు మొద్దు నిద్ర

- ఈ ఏడాది ఇప్పటికే 60 వేల మంది బాధితులు
- జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 10 లక్షల వీధి కుక్కలు
- కుక్కకాటు మృతులకు రూ.5 లక్షలు ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కుక్కకాట్లకు చిన్నారులు బలవుతున్నా కాంగ్రెస్ సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేకపోవటం దుర్మార్గమని మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కుక్కలు పీక్కుతినడం, కుక్కకాటుకు మరణాలు అనే వార్తలు రాష్ట్రంలో సాధారణంగా మారిపోయాయని, కుక్క కాట్లు పెరిగిపోతున్నాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదని ఎక్స్ వేదికగా సర్కారు తీరును ఎండగట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఏడాది రాష్ట్రంలో 60వేలకు పైగా కుక్క కాట్లు నమోదయ్యాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని, ఎన్నో కుటుంబాల్లో విషాదం నిండిందని తెలిపారు. నియంత్రణ పక్కనపెడితే, ప్రభుత్వ దవాఖానల్లో కనీసం యాంటిరేబిస్ ఇంజక్షన్లనూ అందుబాటులో ఉంచలేదని మండిపడ్డారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసిందని, చెత్తాచెదారం పేరుకుపోయి వీధికుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. పురపాలకశాఖ వైఫల్యం వల్ల వీధి కుక్కల నియంత్రణ లేక మనుషుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని, రాష్ట్రంలో 20 లక్షలకు పైగా వీధికుక్క లు ఉంటే అందులో 10 లక్షలకు పైగా కుక్క లు జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉన్నాయంటే ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లకు (స్టెరిలైజేషన్) ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటం శోచనీయమని తెలిపారు. కుక్కకాటు మరణాలపై హైకోర్టు మందలించినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రవీడటం లేదని, ఇప్పటికీ కుక్క కాట్ల నివారణకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని ధ్వజమెత్తారు. గత మూడేండ్లుగా ఒక కుక్క కాటు మరణం సంభవించని గోవా లాంటి రాష్ట్రాల నియంత్రణ పద్ధతులను అధ్యయనం చేయాలని సూచించారు. హర్యానా, పంజాబ్ హైకోర్టుల తీర్పును దృష్టిలో పెట్టుకొని కుక్క కాటుతో మరణించినవారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50వేలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హైకోర్టు సూచన మేరకు వీధి కుక్కల నియంత్రణకు కమిటీలు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా స్టెరిలైజేషన్ చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రిటైర్‌మెంట్ డబ్బులు ఎప్పుడిస్తారు?

- ప్రభుత్వాన్ని నిలదీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు జోరందుకున్నాయి. 65 ఏండ్లు దాటిన టీచర్లను ఉద్యోగం నుంచి తొలగించినా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు నల్ల భారతి ఆరోపించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇస్తామని హామీ ఇచ్చారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీవో రావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలలు నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వంట గ్యాస్, కూరగాయల బిల్లులు సకాలంలో రావడంలేదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీల్లో పని చేస్తున్న సిబ్బంది పదవీ విరమణతో ఐదు వేలకు పైగా టీచర్లు, ఆయాలు తగ్గిపోవడడంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రి, అధికారులను సంప్రదిస్తున్నా ఇంతవరకు ఎలాంటి హామీ రాలేదని మండిపడ్డారు.

# కోచింగ్ సెంటర్లపై కొరడా

- కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలని సర్కారు నిర్ణయం
- కొత్తగా లెక్చరర్ల నియామకానికి కాలేజీ సర్వీస్ కమిషన్
- ఇంజినీరింగ్ కాలేజీలుగా 9 పాలిటెక్నిక్ కాలేజీలు: మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని పోటీపరీక్షలు సహా ఎస్‌సెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్న కోచింగ్ సెంటర్లపై సర్కారు కొరడా ఝులిపించనున్నది. నిబంధనలు పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోనున్నది. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అమలుచేయాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయం తీసుకున్నది. ఇంటర్ నుంచి యూనివర్సిటీల వరకు అన్ని స్థాయిల్లో లెక్చరర్ల నియామకం కోసం కాలేజీ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని సర్కారు పరిశీలిస్తున్నది. ఈ నేపథ్యంలో విద్యారంగంలో సంస్కరణలకు ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సచివాలయంలో భేటీ అయ్యింది. మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోచింగ్ సెంటర్ల నిర్వహణ విషయంలో కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలుచేయకపోవటంతో ఇటీవలే కేంద్రం సీరియస్ అయ్యింది. దీంతో ఆ మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలుచేయాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ), ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణకు ఫీజు రెగ్యులేటరీ కమిటీ, తెలుగుభాష అమలు, ఆర్టీఈ ప్రకారం ప్రైవేట్ బడుల్లో 25 శాతం సీట్లు.. తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రాథమికోన్నత బడులను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసే అంశంపై నివేదికను సమర్పించాలని శ్రీధర్ బాబు సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న స్కూళ్లలోని 1,600 మంది టీచర్లను ఇతర స్కూళ్లకు బదిలీచేయాలని ఆదేశించారు. 9 పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజినీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ట్రిపుల్ ఐటీలో బయోసైన్సెస్, ఫార్మా కోర్సులను వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టాలని వెల్లడించారు. ప్రైవేట్ స్కూళ్లు, ఇంటర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణపై కమిటీ వేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయినట్టా? కానట్టా?

- బదిలీ చేసి నెలరోజులైనా ఉత్తర్వులివ్వని వైనం
- ఇదీ సాంఘిక సంక్షేమ గురుకుల బదిలీ ప్రక్రియ

హైదరాబాద్, సెప్టెంబర్11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ లో బదిలీ ప్రక్రియ అంతు చిక్కడం లేదు. సొసైటీలోని నాలుగో తరగతి ఉద్యోగులకు గత జూలై 31న బదిలీల ప్రక్రియను పూర్తి చేసినా ఇప్పటివరకు ఉత్తర్వులను మాత్రం ఇవ్వడం లేదు. ఇదేమంటే ఆ బదిలీల ప్రక్రియను కలెక్టర్లకు అప్పగించామని సొసైటీ ఉన్నతాధికారులు చెబుతుండగా, తమకేమీ సంబంధం లేదని కలెక్టర్లు బదులిస్తుండటం కొసమెరుపు. దీంతో ఈ ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. సొసైటీలో నాలుగవ తరగతి ఉద్యోగులు దాదాపు 400మందికిపైగా ఉన్నారు. బదిలీ కోసం జూలై31న కౌన్సెలింగ్ నిర్వహించారు. నెలన్నర గడచినా ఎలాంటి ఉత్తర్వులను ఉన్నతాధికారులు వెలువరించలేదు. దీంతో సొసైటీలోని నాలుగవ తరగతి ఉద్యోగులందరూ ఆందోళనకు గురవుతున్నారు. బదిలీలు ఉన్నట్టా? లేనట్టా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్డీఎస్‌ఏ తుది నివేదికను తెప్పించండి

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎన్డీఎస్‌ఏ నుంచి తుది నివేదికను త్వరితగతిన తెప్పించేందుకు కృషిచేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో ఆయన బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పలు పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులపై వానకాలంలో నిర్వహించాల్సిన పరీక్షలన్నీ పూర్తిచేసి ఆ నివేదికను ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి సమర్పించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది

# బీసీల జెండా ఎత్తితే బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం

- బీసీ ఉద్యమాలు పదునెక్కాలి: జస్టిస్ ఈశ్వరయ్య



ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ రచించిన 'కులగణన-రిజర్వేషన్లు, శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, ఎంపీ రవిచంద్ర, ప్రభుత్వ సలహాదారు కేకే, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 11: బీసీల సమస్యలు, కులగణన ఉద్యమాన్ని బీఆర్‌ఎస్ తన భుజస్కంధాలపై వేసుకుంటే ఆ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ రచించిన 'కులగణన-రిజర్వేషన్లు, శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని జస్టిస్ ఈశ్వరయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ సలహాదారులు కే కేశవ రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్‌తో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావాలంటే బీసీల సమస్యల జెండాను ఎత్తాలని కోరారు. బీసీలు చైతన్యంతో హక్కులను సాధించుకుంటే అగ్ర కులాల వారు రిజర్వేషన్లు అడిగే దశకు వస్తారని, ఆ దిశగా బీసీ ఉద్యమాలు పదునెక్కాలని పిలుపునిచ్చారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బీసీల సమస్యల సాధనకు పార్లమెంట్‌లో కొట్లాడుతానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ మంత్రివర్గ కూర్పులో ఇద్దరే బీసీ మంత్రులున్నారని, మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ, మైనార్టీలు వర్గాలకు ఎందుకు ప్రాతినిధ్యం కల్పించలేదని ప్రశ్నించారు. సామాజిక ఉద్యమకారుడు రౌతు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ దేవళ్ల సమ్మయ్య, ఆకుల రజిత్, సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, వనమాల చంద్రశేఖర్, ఉస్మానియా అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల హామీల అమలెప్పుడు?

- బీసీ 'ఏ'లోకి మార్చాలని జేఏసీ చైర్మన్ లక్ష్మీనారాయణ ముదిరాజ్ డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను మరిచిందని మండిపాటు



ఖైరతాబాద్, సెప్టెంబర్ 11: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని తెలంగాణ ముదిరాజ్ జేఏసీ చైర్మన్ పొల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ముదిరాజ్‌లను బీసీ'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని, మంత్రి పదవి, ఎమ్మెల్సీతోపాటు నాలుగు నామినేటెడ్ కార్పొరేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ భవనాన్ని పూర్తి చేయాలని, బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ముదిరాజ్, మహిళా నాయకురాలు పుష్పలత, నీరజ పాల్గొన్నారు.



మత్స్యభవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

## 50% చేపపిల్లల పంపిణీ నిర్ణయం సరికాదు

- ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 11 : ప్రభుత్వం ఈ ఏడాది చేప పిల్లల పంపిణీని 50 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సరికాదని, దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతారని ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ అన్ని జిల్లాల మత్స్యకారుల ఆధ్వర్యంలో బుధవారం శాంతినగర్‌లోని మత్స్యభవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం వంద శాతం చెరువుల్లో చేపపిల్లలను వదిలినట్టు గుర్తుచేశారు.బాలు, వెంకటేశ్, జగన్, రంజిత్, రాజేశ్, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

## 25న హైదరాబాద్‌లో కులగణన మార్చ్

- కులగణనపై హైకోర్టు తీర్పు సర్కారుకు చెంపపెట్టు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



ఖైరతాబాద్, సెప్టెంబర్ 11 : ఈ నెల 25న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్కు వరకు లక్షలాది మంది బీసీలతో కులగణన మార్చ్ చేపడుతున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కులగణనపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ స్వరం మార్చిందని, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, త్వరితగతిన కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందని చెప్పారు. హైకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశ్ చారి, బాలరాజు గౌడ్, శ్యాంసుందర్, శ్రీనివాస్, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.